


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న హెచ్ఎం వెంకటేశ్వర్లు

- వంద శాతం జీఈఆర్‌తో కొట్టాలచెరువు పాఠశాల అరుదైన ఘనత
- పీఎం జన్‌మన్ కింద గ్రామానికి వసతిగృహం
- ఆదర్శంగా నిలుస్తున్న ఎంపీపీ పాఠశాల
- విద్యార్థులందరికీ 'తల్లికి వందనం'
- హెచ్ఎం చొరవతో విద్యార్థులు బడిబాట
- చివరి దశలో ఆదివాసీ విద్యాలయ నిర్మాణ పనులు

చెంచుల చెంతకు..

నల్లమల అటవీ అంచుల్లోని చిట్టచివరి మారుమూల గ్రామం. చెంచు గిరిజనులతో సహా వెనుకబడిన తరగతులకు చెందిన పలు వర్గాలు ఇక్కడ జీవనం సాగిస్తుంటాయి. ఈ గ్రామంలో చాలా మందికి విద్య ప్రాముఖ్యత తెలిసేది కాదు. అందుకే తమ పిల్లలను సరిగ్గా బడికి పంపించకపోవడంతో పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా ఉండేది. గ్రామంలో బడికి వెళ్లే పిల్లల సంఖ్యతో పోల్చితే బడికి వెళ్లని వారే ఎక్కువ. ఇదంతా ఒకప్పటి మాట.. ప్రస్తుతం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు చొరవతో గ్రామంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పిల్లలందరూ బడిబాట పట్టారు. ఎవరైనా బడికి రాకపోతే మాత్రం హెచ్ఎం ఊరురుకోరు. పిల్లలు బడికి ఎందుకు రాలేదో ఆరా తీసి ఎక్కడున్నారో గుర్తించేవారు. అవసరమైతే అడవుల్లో సైతం వెతికి పిల్లలను బడికి పిలుచుకొస్తారు. దీంతో ఈయనంటే విద్యార్థులకు గౌరవంతో కూడిన భయం ఏర్పడింది. ఇంతటి నిరంతర కృషితో నేడు కొట్టాలచెరువు ఎంపీపీ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది.

ఆత్మకూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నల్లమల అడవిలోని చిట్టచివరి గ్రామం కొట్టాలచెరువు. ఒకప్పుడు విద్యకు దూరంగా ఉండేది. ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. ఆ గ్రామంలోని ఎంపీపీ పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు చొరవతో గిరిజన పుత్రులు సరస్వతీ కుమారులుగా మారారు. పిల్లలందరూ బడిబాట పట్టారంటే మామూలు విషయం కాదు. వంద శాతం జీఈఆర్ (గ్రాస్ ఎన్రోల్‌మెంట్ రేషియో) సాధించి జిల్లాలోనే అరుదైన పాఠశాలగా ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువు ఎంపీపీ పాఠశాల ఆదర్శంగా నిలిచింది.

విద్యార్థులతో పాఠశాల కళకళలాడుతోంది

ఇక్కడ చాలా మంది గిరిజన కుటుంబాలకు చెందిన పిల్లలు ఉంటారు. వీరిలో కొందరు తల్లిదండ్రులతో కలిసి అడవిబాట పడుతుంటారు. అకారణంగా విద్యార్థులు బడికి రాకపోతే మాత్రం ప్రధానోపాధ్యాయులు ఊరుకునే ప్రసక్తే ఉండదు. పిల్లలు బడికి ఎందుకు రాలేదో ఆరా తీసి ఎక్కడున్నారో గుర్తించేవారు. అవసరమైతే అడవుల్లో సైతం వెతికి పిల్లలను బడికి పిలుచుకొస్తారు. దీంతో ఈయనంటే విద్యార్థులకు గౌరవంతో కూడిన భయం ఉండటంతో చాలా మంది విద్యార్థులు ప్రతిరోజు యూనిఫామ్ ధరించి పాఠశాలకు శ్రద్ధగా వస్తుంటారు. దీంతో పిల్లలెవరూ.. బడికి వెళ్లకూడదన్న ఆలోచనే లేకుండా ఉండటంతో పాఠశాల విద్యార్థులతో కళకళలాడుతోంది. కాగా ఒకప్పుడు చాలామంది విద్యార్థులు ఆధార్ నమోదు కూడా లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు కూడా సరిగ్గా అందేవి కావు. ప్రస్తుతం విద్యార్థులందరికి ఆధార్ నమోదు ఉండటంతో ఇటీవల అందరికి 'తల్లికి వందనం' కింద విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.13000 చొప్పున నగదు జమైంది.

ఐదేళ్ల క్రితం 27 మంది విద్యార్థులే..

కొట్టాలచెరువు గ్రామంలో సుమారు 1200 వరకు జనాభా ఉంది. గ్రామంలోని ఎంపీపీ పాఠశాలకు ఐదేళ్ల క్రితం 27మంది విద్యార్థులు మాత్రమే వచ్చేవారు. అందువల్ల పలు టీచర్ పోస్టులు కూడా రద్దయ్యాయి. గదులు కూడా రెండు మాత్రమే ఉన్నాయి. ఎవరూ ఊహించని విధంగా ఈపాఠశాలలో 117 మంది విద్యార్థులు ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 93 మంది గిరిజన విద్యార్థులే ఉన్నారు. ప్రతిరోజు విద్యార్థుల హాజరు శాతం కూడా 95శాతం వరకు ఉండటం గమనార్హం. విద్యార్థులు అధికమవ్వడంతో ప్రస్తుతం ఉన్న రెండు తరగతి గదులు చాలక హెచ్ఎం వెంకటేశ్వర్లు తన సొంత ఖర్చులతో పాటు గ్రామస్థుల సహకారంతో అదనంగా పాఠశాల ప్రాంగణంలో ఒక గుడిసెను నిర్మించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. రూ.10లక్షల నాడు-నేడు నిధులతో విద్యార్థులకు అవసరమయ్యే ఫర్నిచర్‌ను, ఇతర సదుపాయాలను కూడా అందుబాటులో ఉంచారు. ఇక్కడ ముగ్గురు రెగ్యులర్ ఉపాధ్యాయులు మాత్రమే ఉండగా ఆర్డీటీ సహకారంతో ఒకరు, హెచ్ఎం సహకారంతో మరో వాలంటరీ టీచర్ల సహకారాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఈ విధంగా గ్రామంలోని పిల్లలందరూ ఎంపీపీ పాఠశాలలకు వెళ్తుండటంతో 100శాతం జీఈఆర్ నమోదు నమోదైంది.

నాణ్యమైన విద్య

ఈ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నీతికథలు, ఆటలు, కళలు, అల్లికలు, రంగోలీ, క్విజ్ వంటి పోటీల్లో ప్రావీణ్యత కల్పిస్తున్నారు. ఇటీవల అంతర జిల్లా స్థాయిలో గిరిజన విద్యార్థులకు జరిగిన వివిధపోటీల్లో ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్య ఊహించని రీతిలో పెరగడంతో పీఎం జన్‌మన్‌లో భాగంగా ఈ గ్రామంలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆదివాసీ విద్యాలయాన్ని మంజూరు చేశారు.



ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు

రూ. .2.3కోట్లతో ఆదివాసీ విద్యాలయం.

గిరిజనులకు మంచి విద్యను అందిస్తే వారి జీవన ప్రమాణాలను మెరుపర్చువచ్చునన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏడు పీఎం జనమన్ హాస్టళ్లను మంజూరు చేసింది. శ్రీకాకుళం జిల్లాకు 2, మిగిలిన 5 నంద్యాల జిల్లాకు మంజూరయ్యాయి. ఇందులో భాగంగనే కొట్టాలచెరువు గ్రామంలో రూ.2.3కోట్లతో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆదివాసీ విద్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ వసతిగృహంలో ఒక్కొ గదికి కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండేలా 50 మంది సామర్థ్యం గల గదులను నిర్మిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య మరింత పెరిగితే మొదటి అంతస్తులో మరిన్ని గదులను నిర్మించాలని భావిస్తున్నారు. మొత్తానికి కొట్టాలచెరువు ప్రాథమిక పాఠశాలలో అనూహ్యంగా విద్యార్థుల సంఖ్య పెరగడం వల్లే ఈ వసతి గృహం మంజూరైనట్లు తెలిసింది. ఈ నిర్మాణ పనులను 2024 అక్టోబరు 5న కలెక్టర్ రాజకుమారితో కలిసి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ప్రస్తుతం ఈ నిర్మాణ పనులు చివరి దశగా చేరుకున్నాయి.

వందశాతం జీఈఆర్ సాధించిన కొట్టాలచెరువు ప్రాథమిక పాఠశాల ఇదే



ఆనందంగా ఉంది



ఒకప్పుడు విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి.. టీచర్ పోస్టులను సైతం కోల్పోయిన కొట్టాలచెరువు ప్రాథమిక పాఠశాలలో నేడు వంద శాతం జీఈఆర్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించడంతో వారిలో కూడా క్రమశిక్షణ పెరిగి శ్రద్ధగా పాఠశాలకు వస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో గదుల కొరత ఉంది. ఈ విషయాన్ని ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-వెంకటేశ్వర్లు, హెచ్ఎం, ప్రాథమిక పాఠశాల, కొట్టాలచెరువు, ఆత్మకూరు

జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్

- 56 మోటార్ సైకిళ్లు, 27 మద్యం బాటిళ్లు, 30 లీటర్ల నాటుసారా స్వాధీనం
- ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా



పట్టుబడ్డ వాహనాలతో పోలీసులు

నంద్యాల టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలలో భాగంగా, ప్రజలకు భరోసా కల్పించేందుకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్ సబ్ డివిజన్ల పరిధిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి 56 మోటార్ సైకిళ్లు, 27 మద్యం బ్యాటిళ్లు, 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనుమానితుల ఇళ్లను, వ్యక్తులను, రౌడీషీటర్ల, నేర చరిత్ర కల్గిన వారి ఇళ్లను పరిశీలించినట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలపాలైన గంజాయి, గుట్కా, మట్కా, అక్రమ మద్యం, నాటుసారా జూదం వంటి వాటిని ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా మెలగాలి

నేర ప్రవృత్తి కలిగిన వారు చట్ట వ్యతిరేక కార్యాకలపాలకు పాల్పడకుండా సమాజంలో ఉత్తమ పౌరులుగా మెలగాలని ఎస్పీ అదిరాజ్ సింగ్‌రాణా పేర్కొన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతి భద్రతలలో భాగంగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచామన్నారు. అలాగే ప్రస్తుతం వారు చేస్తున్న పని, జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో జిల్లా న్యాయాధికారి



మంచాలమ్మకు పూజలు చేస్తున్న కర్నూల్ జిల్లా న్యాయాధికారి

మంత్రాలయం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని కర్నూలు జిల్లా న్యాయాధికారి కబర్డీ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. స్వామిదర్శనార్థం వచ్చిన న్యాయాధికారిని మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, సురేష్ కోనాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాంక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట అనంతపురాణిక్, ఎస్ఐ శివాంజల్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్ తదితరులు ఉన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండల, డివిజన్, మున్సిపల్, కలెక్టరేట్‌లో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. అర్జీదారులు నేరుగా కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కార్యాలయాల్లో కూడా అర్జీలను అందజేయవచ్చని తెలిపారు. అక్కడ పరిష్కారం కాని అర్జీలను మాత్రమే జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్‌లో ఇవ్వవచ్చని తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే పీజీఆర్ఎస్‌కు ప్రతి అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

కిక్కిరిసిన మల్లన్న క్షేత్రం

- సెలవు రోజులు కావడంతో భక్తుల రద్దీ



దర్శనం కోసం క్యూలైన్లలో వెల్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగం, శక్తిపీఠమైన శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన యాత్రికులు తెల్లవారుజాము నుంచి క్యూలైన్లలో బారులుదీరారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి తర్వాత స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న కారణంగా స్వామి, అమ్మవార్ల దర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. భక్తుల శివనామ స్మరణతో శ్రీగిరులు మార్మోగాయి. ఆలయ దర్శనాలు ప్రారంభమై ముగిసేంత వరకు ఉచిత ప్రసాద వితరణ, తాగునీటి సౌకర్యం ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నేటి నుంచి మూడురోజులు వర్షాలు

- నేడు జిల్లా వ్యాప్తంగా 361.6ఎంఎం వర్షపాతం నమోదు
- కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు
- అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ రాజకుమారిగణియా



నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేటి నుంచి మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ సంస్థ వెల్లడించింది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 361.6 ఎంఎం వర్షపాతం నమోదైంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారిగణియా సూచించారు. కాల్వలు, నదీ తీరాల సమీపంలో ఉన్న ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఆర్డీవో, మండల కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చెరువులకు, కాల్వలకు గండ్లు పండే అవకాశం ఉందని, ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దన్నారు. ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలన్నారు. ప్రమాదకరంగా ప్రవహించే కల్వర్టుల వద్ద వాహనాల రాకపోకలను నియంత్రించాలన్నారు. వైద్యసేవలకు అంతరాయం కలుగకుండా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

చాగలమర్రిలో 34.4 ఎంఎం వర్షపాతం నమోదు

ఆదివారం చాగలమర్రి మండలంలో 34.4ఎంఎం వర్షపాతం నమోదైంది. ఆళ్లగడ్డలో 22.6, శిరువెళ్ల 21.6, గోస్పాడు 21.6, డోన్ 18.8, పాములపాడు 18.8, బనగానపల్లె 18.6, పాణ్యం 18.4, నంద్యాల పట్టణం 17.6, నంద్యాల మండలం 16.2, వెలుగోడు 13.8, జూపాడు బంగ్లా 13.8, అవుకు 13.2, సంజామల 11.0, మిడ్తూరు 10.2, మహానంది 10.2, కోవెలకుంట్ల 9.2, బేతంచర్ల 9.2, రుద్రవరం 8.8, కొలిమిగుండ్ల 8.4, ఉయ్యాలవాడ 7.6, పగిడ్యాల 6.8, దొర్నిపాడు 6.4, బండిఆత్మకూరు 6.2, గడివేముల 5.8, ప్యాపిలి 4.6, నందికొట్కూరు 4.2, శ్రీశైలం 2.4, ఆత్మకూరు 1.2ఎంఎం వర్షపాతం నమోదైంది.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

- ఆదోనిలో రైతుల విజయోత్సవ ర్యాలీ
- హాజరైన కూటమి నాయకులు

7

భారతీయ సాహిత్యంలో

తెలుగు కథలు వైవిధ్యం

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్



చాగలమర్రిలో అడ్డవాగు నుంచి సాగు భూములకు వెళ్తున్న రైతులు, కూలీలు

వాగును దాటుతున్న మహిళా కూలీలు

అదుపు తప్పితే...

అడుగులో అడుగువేస్తూ ఎక్కడ పడిపోతామో అనుకుంటూ అనుక్షణం భయం భయంగా వస్తున్న వీరు నిత్యం ఇలా సాహసం చేస్తేనే గమ్యస్థానాలకు చేరుకోగలరు. చాగలమర్రి మండలంలోని గోపాయపల్లె రహదారి వద్దగల అడ్డవాగును ప్రజలు దాటాలంటే ఇలా సర్కస్ ఫీట్లు చేయక తప్పదు. వాగు సమీపంలో 2,500 ఎకరాల్లో కంది, మినుము, మొక్కజొన్న, మల్లెతోటలు ఉన్నాయి. ఈ పంట పొలాలను నమ్ముకొని సుమారు 500 మంది రైతులు, కూలీలు జీవిస్తున్నారు. వర్షపు నీరు, టీజీపీ లీకేజీ నీరు కలిసి అడ్డవాగుకు చేరడంతో రైతులు, కూలీలు వాగు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అడ్డవాగుపై వంతెన లేకపోవడంతో ఇలా వాగుపై మూడు విద్యుత్ స్తంభాలను అడ్డుగా వేసి దాటుకుంటూ వెళ్తున్నారు.

- చాగలమర్రి (ఆంధ్రజ్యోతి)

కర్నూలు డీఈవో విద్యార్హతలపై విచారణకు కమిషనర్ ఆదేశం

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు విద్యాశాఖ అధికారిగా పని పనిచేస్తున్న శామ్యూల్ పాల్ బీఈడీ విద్యార్హత పొందిన విధానంపై సమగ్ర విచారణ చేసి నివేదిక అందజేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు కడప పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకుడిని ఆదేశించారు. ఈ మేరకు విడుదలైన ప్రొసీడింగ్స్‌ను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రధాన కార్యదర్శి ఎన్.శేషఫణిరాజు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా పదోన్నతులకు అర్హులైన అసిస్టెంట్ డైరెక్టర్ల సీనియారిటీ జాబితాలో డీఈవో శామ్యూల్ పాల్‌కు బీఈడీ అర్హత లేదని ఆయన పేర్కొన్నారు అధికారికంగా స్వయంగా సంతకం చేసిన ఉత్తర్వులో కూడా శామ్యూల్ పాల్ తన విద్యార్హత కేవలం బీఏగానే పేర్కొన్నారన్నారు. 24.10.2024న ప్రభుత్వం జారీ చేసిన జీవోఆర్‌టీ.నెం.433 ద్వారా బీఈడీ విద్యార్హతతో కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారిగా పదోన్నతి పొందడంపై వివిధ ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆందోళనలు చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ గౌరవ ప్రతిష్ఠలు దెబ్బతినకుండా ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని కోరడంతో అందుకు స్పందించి విచారణకు ఆదేశించినట్లు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ జనరల్ సెక్రటరీ శేషఫణిరాజు తెలిపారు. పాఠశాలల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డీఈవో శామ్యూల్ పాల్‌పై తక్షణమే వచ్చిన ఆరోపణలపై సమగ్రంగా నిష్పక్షపాతంగా విచారణ చేసి వాస్తవాలను బహిర్గతం చేసి జిల్లా విద్యాశాఖ గౌరవ ప్రతిష్ఠలు కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యాగంటీశ్వరుడిని దర్శించుకున్న కర్నూలు జేసీ



తీర్థ ప్రసాదాలను అందుకుంటున్న కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టరు నవ్య

బనగానపల్లె, ఆగస్టు, 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రాన్ని కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టరు నవ్య ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, మౌళీశ్వరరెడ్డి, పూజారులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టరు నవ్య ఆలయంలోని నందీశ్వరున్ని, ఉమామహేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు చేశారు. జేసీ నవ్యకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు.

చిన్నారిని కాపాడిన ఉద్యోగులు



చిన్నారి తల్లితండ్రులతో ఉద్యోగులు


మహానంది, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ చిన్నారిని స్థానిక ఆలయ ఉద్యోగులు, పోలీసులు కాపాడారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన ఓ కుటుంబం కారులో మహానంది క్షేత్రానికి దర్శనం కోసం వచ్చారు. ఆలయం సమీపంలోని రాతి నంది సర్కిల్ వద్ద కారును నిలిపి తమ ఏడాది వయస్సున్న చిన్నారిని అందులో ఉంచి కారుకు తాళం వేసి దర్శనానికి వెళ్లారు. కారులో ఉన్న ఆ చిన్నారి ఊపిరి ఆడక చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండగా గుర్తించిన ఆలయ ఉగ్యోగి ఈశ్వర్, కానిస్టేబుల్ చంద్రశేఖర్‌తో పాటు మరో ఆలయ ఉద్యోగి నాగార్జునరెడ్డి కలిసి కారు అద్దాలు పగలకొట్టి ఆ చిన్నారిని ప్రాణా పాయం నుంచి రక్షించారు. అనంతరం ఆ చిన్నారిని తల్లితండ్రులకు అప్పగించారు. చిన్నారిని కాపాడిన ఉద్యోగులను పలువురు అభినందించారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న ధ్వంసం



ధ్వంసమైన మొక్కజొన్నను అటవీ సిబ్బందికి చూపిస్తున్న రైతులు

కొత్తపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. దీంతో తమకు నష్టపరిహారం చెల్లించాలని మండలంలోని గుమ్మడాపురం రైతులు అటవీ శాఖ అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు బొల్లు నాగశేషన్న, బొల్లు శ్రీనివాసులు, బి.నాగశేషన్న, శ్రీరాములు, హరిక్రిష్ణ, చెంచన్న, లింగన్న ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామానికి సమీపంలో నల్లమల అడవి ఉండటంతో శనివారం రాత్రి అడవి పందులు గుంపులు గుంపులుగా వచ్చి మొక్కజొన్న పంటలను నాశనం చేశాయన్నారు. దీంతో తీవ్రంగా నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం అటవీ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సుమారు 20 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతులు వారికి వివరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తమకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు విన్నవించారు.



ప్రకృతి ఒడిలో కృష్ణమ్మ పయనం

శ్రీశైలంలో ఉధృతంగా ఉప్పొంగే నీటి ప్రవాహమే కాదు.. చుట్టుపక్కల ప్రకృతి అందాలను కలుపుకొని ప్రవహించే కృష్ణా జలాల సోయగం ఎంతటివారినైనా ఇట్టే కట్టిపడేస్తుంది. రాయలసీమ రైతుల గుండెచప్పుడుగా ఉండే శ్రీశైలం జలాశయం పరిసర ప్రాంతాలన్నీ ప్రకృతి ప్రసాదించిన అపురూప దృశ్యాలు. డ్యాం గేట్ల ముందువైపు భారీ శబ్దంతో గంభీరంగా కనిపిస్తుండగా... డ్యాంపై భాగంలో ప్రశాంతంగా నిద్రిస్తున్నట్లు ఉండేలా కృష్ణమ్మ కనిపిస్తుంది. పచ్చదనం విచ్చుకున్న శ్రీశైలం జలాశయం పరిసరాలను వీక్షించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.

- నంద్యాల (ఆంధ్రజ్యోతి)

'హ్యూమన్ సోర్స్ యాప్'లోకి వర్సిటీల డేటా..!



- బోధన, బోధనేతర, నిధులు, వ్యయాలపై ఆరా
- కాంకరెన్స్ లేని నియామకాలపై సందిగ్ధత
- వివరాలు సేకరిస్తున్న మాట వాస్తవమే : ఆర్‌యూ వీసీ

కర్నూలు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'హ్యూమన్‌సోర్స్ యాప్' పేరుతో వర్సిటీల డేటాపై ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. విద్యార్థులకు ఉన్నత విద్య కీలకం కావడంతో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. కాంకరెన్స్ (ప్రభుత్వ అనుమతి) లేని నియామకాలపై తర్జన.. భర్జనలో ఉన్నట్లు సమాచారం. ఆ క్రమంలో జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల పాలన, బోధనపై వివరాలను ఉన్నత విద్యామండలి (యాప్సి) సేకరిస్తోంది. బోధన, బోధనేతర ఉద్యోగులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అప్ లోడ్ చేసేందుకు ఆదేశించింది. ప్రతి ఏటా నిధిపోర్టల్ యాప్‌లో జరిగే ప్రక్రియ అయినప్పటికీ ఈ ఏడాది పక్కగా మరో యాప్‌లో కూడా వివరాలు పొందుపరచాలని ఉన్నత విద్యా ఆదేశించిందని వర్సిటీల అధికారులు చెబుతున్నారు. ఉద్యోగుల జీత, భత్యాల పంపిణీలో సీఎఫ్‌ఎంఎస్ డేటాకు సంబందించిన సమస్యలకు చెక్ పెట్టేందుకు ఈ ప్రక్రియను తెరపైకి తెచ్చారని తెలిసింది. జిల్లాలోని ఓ వర్సిటీకి సంబంధించి వివరాల్లో ఏళ్ల తరబడి సమస్యల పరిష్కారం కాకపోవడంతో పాటు పలు అవకతవకలు జరిగాయి. వాటిని తిరస్కరించడంతో పక్కగా వాటి వివరాలు పొందు పరిచేందుకు వర్సిటీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఇటీవల జరిగిన పాలక మండలిలో బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించిన సమస్యాత్మక విషయాలపై ఉన్నతాధికారులతో చర్చించినట్లు సమాచారం. ఆ దిశగా వివరాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఆదేశించడంతో ఆన్‌లైన్‌లో ప్రతి అంశం చేర్చడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలు ప్రస్తుతం యాప్ అప్‌లోడ్ ప్రక్రియలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

వివరాలు సేకరిస్తున్న మాట వాస్తవమే

వివరాలను సేకరిస్తున్న మాట వాస్తవమే. గత పాలనలో కొన్ని నియామకాలకు సంబంధించిన ప్రక్రియలో కాంకరెన్స్ లేకుండా నియామకాలు జరిగాయి. ఫలితంగా సీఎఫ్‌ఎంఎస్ డేటాలో సమస్యలు ఇబ్బందికరంగా తయారయ్యాయి. వాటన్నింటిని సక్రమంగా గాడిలో పెట్టేందుకు ఉన్నత విద్యామండలి ప్రతి చొరవ తీసుకుంటోంది. హ్యూమన్‌రీసోర్స్ యాప్ ద్వారా వివరాలను సేకరిస్తోంది.

- షాషావలి ఖాన్, ఉపకులపతి, డాక్టర్ అబ్దుల్ హక్ వర్సిటీ

ఆర్థిక లావాదేవీలు సైతం..

వర్సిటీలకు సంబంధించిన ప్రతి అంశం ఇకపై ఉన్నత విద్యా మండలి పర్యవేక్షణలో జరిగేందుకు ప్రభుత్వం కసరత్తు చేపడుతోంది. వ్యయం, నిధులతో పాటు వర్సిటీ క్యాంపస్‌లోని ప్రతి ఒక అంశానికి వివరాలను సేకరించే దిశగా ఓ వెబ్ పోర్టల్‌ను వర్సిటీలకు పంపింది. వసతి గృహాలు, విద్యార్థుల తరగతి గదులు, ప్రతి ఆర్థిక లావాదేవీలు ఉన్నత విద్యాపర్యవేక్షణకు ఆన్‌లైన్‌విధానం తెరపైకి తెచ్చారు. గతంలో నియామకాలకు సంబంధించి ఉన్నత విద్యా మండలి అనుమతులు లేకుండా నియామకాలు జరగడం వల్లే సీఎంఎస్ఎఫ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల పలువురు ఉద్యోగులకు వేతనాలు నిలిచిపోయాయి. దీంతో ఆ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

రైతు బలవన్మరణం

పంటలు పండక, అప్పులు తీర్చలేక ఉరి



రాజు(ఫైల్)

నందవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పంటలు పండక.. అప్పులు అధికమై ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన నందవరం మండలంలోని హలహర్వి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హలహర్వి గ్రామానికి చెందిన రైతు రాజు(27)కు అదే గ్రామానికి చెందిన మహాదేవితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉండగా, ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భవతి. రాజు భార్యతో కలసి కూలీ పనులు చేసుకుంటూ గ్రామంలోనే 3 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేసేవాడు. ఐదేళ్లుగా మిరప, పత్తి పంటలను సాగు చేశాడు. అయితే ప్రకృతి కరుణించకపోవడంతో మిరప పంటకు తెగుళ్ల సోకి దిగుబడులు రాలేదు. ఈ పంటల కోసం వివిధ చోట్ల రూ.6లక్షలకు పైగా అప్పులు చేశాడు. పంటలు చేతికందకపోగా అప్పులకు వడ్డీలు అధికమయ్యాయి. ఈ క్రమంలో రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో నిత్యం రాజు మదనపడేవాడు. ఇటీవల భార్య మహాదేవి ప్రసవానికి పుట్టింటికి వెళ్లింది. అప్పులు ఎలా తీర్చడం లేదంటూ శనివారం రాత్రి భార్య ఇంటికి వెళ్లి రాజు ఆవేదన వ్యక్తం చేశాడు. తనతో పాటు ఇంటికి రావాలని భార్యను పిలవగా, ఈ పరిస్థితుల్లో తాను రాలేనని ఆమె చెప్పింది. సరేనని అక్కడి నుంచి వెళ్లిన రాజు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం 8 గంటలైనా తలుపులు తెరవకపోవడంతో రాజు చిన్నమ్మ ఉలిగమ్మ వెళ్లి చూసింది. భర్త మరణవార్త తెలుసుకున్న మహాదేవి అక్కడకు చేరుకుని రోదించిన తీరు కలచివేసింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కొదండరామిరెడ్డి తెలిపారు.

నేడు నగర పాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుం దన్నారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటార న్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీలో ఏవైనా స్థానిక సమస్యలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

- ఆదోనిలో రైతుల విజయోత్సవ ర్యాలీ
- హాజరైన కూటమి నాయకులు



విజయోత్సవ ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా చంద్రన్న పాలన కొనసాగుతోందని కూటమి నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం నిధులను మంజూరు చేయడంతో ఆదివారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో 350కి పైగా రైతులు ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి భీమాస్ సర్కిల్ వరకు ట్రాక్టర్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మాట్లాడుతూ ఎన్నికల హామీ నిలబెట్టుకుని అన్నదాత సుఖీభవ పథకం కింద తొలివిడతగా రూ.7 వేలు చొప్పున జమ చేసిన సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలు దగాకు గురయ్యారన్నారు. గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఎరువుల వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, టీడీపీ అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి, నాయకులు గుడిసె కృష్ణమ్మ, బసాపురం రామస్వామి, భూపాల్‌చౌదరి, మారుతినాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, బీజేపీ నాయకులు ఉపేంద్ర, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పార్థసారథితో కరచాలనం చేస్తున్న మీనాక్షినాయుడు

వ్యవసాయానికే ప్రాధాన్యం : ఎమ్మెల్సీ బీటీ నాయుడు

విత్తనాల పంపిణీ నుంచి ఎరువులు, సాగునీరు తదితర విషయాల్లో రైతులకు మేలు చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వ్యవసాయానికే ప్రాధాన్యం ఇస్తూ చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. రైతులను అన్నివిధాలుగా ఆదుకోవడం కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పరిపాలన సాగిస్తున్నారు. పొలంలో విత్తనాలు చల్లడం, పంటలకు ఎరువులు వేయడం, పురుగు నివారణ మందులు పిచికారి చేయడం కోసం రైతులకు రాయితీపై తమ ప్రభుత్వం డ్రోన్లు అందిస్తోంది.

హామీలన్నీ అమలు చేస్తున్నాం : ఎమ్మెల్యే పార్థసారథి

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. రైతులకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిబద్ధతతో పనిచేస్తున్నాయి. ఈనెల ఆగస్టు 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చి ఇచ్చిన హామీని నెరవేర్చాం.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు స్పష్టమైన హామీనిచ్చారు. ఆదివారం నగరంలోని వెంకటరమణ కాలనీలో కీర్తన అనాథ శరణాలయంలో ఏపీయూడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తదితరులు హాజరయ్యారు. ముందుగా యూనియన్ నాయకులు పతాకాన్ని ఎగురవేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి మాట్లాడుతూ జర్నలిస్టుల డిమాండ్లను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ యూనియన్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. చిన్నారులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, ఐజేయూ సభ్యుడు నాగరాజు, యూనియన్ నాయకులు ఎన్వీ సుబ్బయ్య, శ్రీనివాసగౌడ్, శివరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలూరులో జరిగిన వేడుకల్లో డీఈఓ శామ్యుల్‌పాల్ పాల్గొన్నారు. అదేవిధంగా మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, గూడురు, నంద్యాల పట్టణాల్లో ఆవిర్భావ వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

భారతీయ సాహిత్యంలో తెలుగు కథలు వైవిధ్యం

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్



ప్రసంగిస్తున్న కెంగార మోహన్

కర్నూలు కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ సాహిత్యంలో తెలుగు కథలు వైవిధ్యమైన పాత్ర పోషిస్తున్నాయని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కేంద్ర సాహిత్య అకాడమీ, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో '75 ఏళ్ల తెలుగు చిన్న కథలు' అనే అంశంపై నిర్వహించిన సద స్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెంగార మోహన్ మాట్లా డుతూ 1947 నుంచి 2022 వరకు తెలుగు కథలలో అనేక మార్పులు, పరిణా మాలు వచ్చాయన్నారు. సమాజాన్ని తీవ్ర ప్రభావితం చేశాయని గుర్తు చేశారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ సాహిత్య అకాడమీ దేశవ్యాప్తంగా భాషా సాహిత్యా లకు వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. అకాడమీ తొలి అధ్యక్షులుగా నెహ్రూ పనిచేశారని సభకు తెలియజేశారు. ఈ సదస్సులో ప్రగతిశీల విప్లవ కథలు అనే అంశంపై విరసం నేత నాగేశ్వరాచారి, మైనారిటీ, స్త్రీవాద కథలపై ఎస్ ఎండీ ఇనాయతుల్లా, దళిత, బహుజన, గిరిజన కథలు అనే అంశంపై జి.వెంక టకృష్ణ, ప్రాంతీయ కథలు అనే అంశంపై పౌరోహితం మారుతి ప్రసంగిం చారు. సదస్సును సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి ప్రారంభించగా, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సదస్సు లక్ష్యాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలు వురు కవులు, రచయితులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

మహానంది/నంద్యాల టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గుంటూరు- గుంతకల్లు మార్గంలోని గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై సుమారు 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం ఉదయం గుర్తించినట్లు నంద్యాల రైల్వే ఎస్‌ఐ కుమారి తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. ఆ వ్యక్తి నల్లటి టీషర్ట్, టవల్ ధరించి ఉన్నట్లు తెలిపారు. పొరపాటున రైలు నుంచి పడి మృతి చెందాడా.. లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణంలో విచారిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ పార్క్‌లోని ఆయుష్ యోగా కేంద్రంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ యోగా సెంటర్ నిర్వాహకుడు ఆనంద్ గురూజీ మాట్లాడుతూ వారం రోజులుగా సత్యసాయి శతజయంతి ఉత్సవాలలో భాగంగా రెడ్‌క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్లో రక్తనిల్వల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. యోగా, సత్యసాయి సభ్యులు రక్తదానం చేశారన్నారు. అలాగే ప్రతిభ వృద్ధాశ్రమంలో అన్నప్రసాద వితరణ చేశామన్నారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు దస్తగిరి, నాగేశ్వరరావు, ఆంజనేయులు, జెట్టి వెంకటేశ్వర్లు, రమేష్, యోగా సభ్యులు, సత్యసాయి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

శ్రీశైలమల్లన్న క్షేత్రంలో సోమవారం స్థానికులు, భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వైద్యశాలలో ఉచితన వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాడిపత్రికి చెందిన మల్లికార్జున నాయుడి సహకారంతో నిర్వహిస్తున్న ఈ వైద్యశిబిరంలో ఎముకలు, నరాలు, కండరాలు, జనరల్ వైద్య పరీక్షలు, చిన్నపిల్లలకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

షుగర్ పరీక్షలు..

నంద్యాల విశ్వహిందూ పరిషత్ సేవా విభాగం ఆధ్వర్యంలో సెవెన్ హిల్స్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత చక్కెర వ్యాధి శిబిరం నిర్వహించారు. మందులు, షుగర్ పరీక్ష పరికరాలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా సేవా ప్రముఖ్ మోహన్ కిరణ్, ప్రఖండ అధ్యక్షురాలు సానంరెడ్డి సుహాసినిరెడ్డి మాట్లాడుతూ సేవ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు హిందుత్వ మాధుర్యాన్ని అందిస్తున్నా మన్నారు. 120 మంది షుగర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నా న్నారు. ఈ కార్యక్రమంలో భగరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

లారీపై కూలిన వృక్షం.. నిలిచిన రాకపోకలు


వెలుగోడులో లారీపై కూలిన వృక్షం

వెలుగోడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాలు, గాలులకు భారీ వృక్షం కూలి నిలిపి ఉన్న లారీపై పడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్ప డింది. ఆదివారం వెలుగోడు-నంద్యాల వెళ్లే రహదారిపై నిలిపి ఉన్న లారీపై వృక్షం పడటంతో కి.మీ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్ఐ సురేశ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ అధికారుల సమన్వయంతో వృక్షాన్ని తొలగించారు.

21న గోధుమలతో వడిబియ్యం కార్యక్రమం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆయుష్ యోగా కేంద్రంలో ఈనెల 21వ తేదీన సంతానభాగ్యం కోసం గోధుమల తో వడిబియ్యం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆనంద్ గురూజీ తెలిపారు. యోగాతో పాటు నిత్యం ఓంకారం, సాయి గాయత్రీ జపం, సత్సంగం, గురుపూజ, సత్యసాయి అష్టోత్తరాలు ఉచ్చరించే ఈ యోగా కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు ఆయుష్ యోగా మహిళా విభాగం సెల్ నెంబర్లు 9704019365, 91602 40807కు సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. కాగా ఈ అవకాశం కేవలం 21మంది మహిళలకు మాత్రమేనని తెలిపారు. కార్యక్రమం అనంతరం అన్నప్రసాదం ఉంటుందని పేర్కొన్నారు.

ఫ్యాక్టరీపై విచారణ జరిపించాలి: సీపీఎం


కెమికల్ ఫ్యాక్టరీని చూపిస్తున్న సీపీఎం నాయకులు

జూపాడుబంగ్లా, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రం భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్మిస్తున్న కెమికల్ ఫ్యాక్టరీపై విచారణ నిర్వహించి స్థానికులకు ఉపాధి కల్పించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, కర్ణ, గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం బృందం గుట్టుచప్పుడుకాకుండా నిర్మిస్తున్న ఆధ్వ అగ్రిక్రాస్ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని పరిశీలించింది. ఈ సందర్భంగా అక్కడున్న వారిని ఎవరి అనుమతితో నిర్మిస్తున్నారని, ఏయే ఉత్ప త్తులు తయారు చేస్తున్నారని, స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నారా.. అనే విషయాలను అడుగుతుండగా వారు తమపై దురుసుగా ప్రవ ర్తించారన్నారు. అన్ని అనుమతులు ఉన్నాయంటూ తమను అక్కడి నుంచి పంపించారన్నారు. ఏయే ఉత్పత్తులు చేస్తున్నారో అధికారులు బహిర్గతం చేయాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

అలంకారప్రాయం.. ఆ సచివాలయం


బనకచర్ల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నూతన సచివాలయం

పాములపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయల నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆ సచివాలయాన్ని నిరుపయోగంగా వదిలేశారు. అది అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది. దీంతో సిబ్బంది పాత సచివాలయంలోనే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. మండలంలోని బనకచెర్ల గ్రామంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో రూ.35 లక్షలు వెచ్చించి సచివాలయ నిర్మాణం పూర్తిచేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19న నందికొట్కూరు శాసనసభ్యుడు గిత్తా జయసూర్య సర్పంచ్ ఆవుల జయసుధ, నారాయణరెడ్డి దంపతులతో కలిసి ఆ సచివాలయాన్ని ప్రారంభించారు. అలాగే సచివాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అయితే సచివాలయం ప్రారంభించి ఆరు నెలలు దాటినా ఇంకా సిబ్బంది పాత సచివాలయంలోనే విధులు నిర్వర్తించడం ఏమిటని గ్రామస్థులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సచివాలయాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

యూరియా కొరతపై ఆందోళన వద్దు

- ఆత్మకూరు డివిజన్‌కు ఇప్పటివరకు 3623 మెట్రిక్ టన్నుల దిగుమతి
- మరో 733 మెట్రిక్ టన్నుల కోసం ప్రతిపాదనలు
- రైతులకు ఆందోళన వద్దంటున్న వ్యవసాయాధికారులు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆత్మకూరు వ్యవసాయ డివిజన్‌లో యూరియా కొరత తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. డివిజన్‌కు ఇప్పటివరకు 3623 మెట్రిక్ టన్నులు దిగుమతి చేశారు. మరో 733 మెట్రిక్ టన్నుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. యూరియా కొరతపై రైతులకు ఆందోళన వద్దని వారు భరోసా ఇస్తున్నారు.


ఆత్మకూరులోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏడీఏ హేమలత


యూరియా బస్తాలు


పొలంలో యూరియా చల్లుతున్న రైతు

ఆత్మకూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆత్మకూరు డివిజన్‌కు ఇప్పటివరకు 3623 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి అయింది. ఇందులో ఆత్మకూరు మండలానికి 1688 మెట్రిక్ టన్నులు, వెలుగోడుకు 852 మెట్రిక్ టన్నులు, పాములపాడుకు 760 మెట్రిక్ టన్నులు, కొత్తపల్లికి 322 మెట్రిక్ టన్నుల చొప్పున దిగుమతి అయింది. వీటిని డీసీఎంఎస్, ఆయా మండలాల సింగిల్ విండో సొసైటీలతో పాటు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల ద్వారా పంపిణీ చేశారు. అయితే యూరియా ఎరువులకు మరింత డిమాండ్ ఉండటంతో డివిజన్ ద్వారా మరో 733 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ప్రతిపాదనలు పంపించారు. అయితే చాలా మంది రైతులు తమ అవసరానికి మించి యూరియాను కొనుగోలు, వాడకం వల్లే కొరత ఏర్పడినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఒక ఎకరాకు రెండు బస్తాల చొప్పున యూరియా చల్లితే చాలని.. కానీ చాలా మంది ఒక్కో ఎకరాకు నాలుగైదు బస్తాల యూరియాను వాడుతున్నట్లు తెలుస్తోందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. అలాగే అవసరం లేకున్నా యూరియాను కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ ఉంచుకున్నట్లు తెలిపారు. ఈ కారణాల వల్లే తాత్కాలికంగా యూరియా కొరత ఏర్పడినట్లు భావిస్తున్నారు. రైతులు తగిన మోతాదులో మాత్రమే ఎరువులను వాడాలని, తద్వారా దిగుబడులతో పాటు పంట భూములకు మేలు జరుగుతుందని చెబుతున్నారు.

యూరియా అధిక వాడకంతో పంటకు నష్టం

పంటకు అధికంగా యూరియా అందించడం వల్ల నష్టం వాటిల్లుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఎకరాకు రెండు బస్తాల చొప్పున యూరియాను వాడటం వల్ల పంట దిగుబడులు మెరుగుపడటమే కాకుండా భూమిలో సారవంతం తగ్గదన్నారు. యూరియా ఎక్కువగా వాడకం వల్ల పైరు ఏపుగా పెరిగి దిగుబడి తగ్గడమే కాకుండా చిన్నపాటి గాలులకే పంట వాలిపోయే ప్రమాదముందన్నారు. తెగుళ్లు కూడా ఎక్కువగా ఆశించే అవకాశముందన్నారు. యూరి యా బస్తాల కుబదులు 500మిలీ నానో యూ రియాను వాడటం వల్ల భూమిలో 85 నుంచి 90 శాతం నత్రజని వృద్ధి చెంది పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు



ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో యూరియా కొరత తలెత్తకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నాం. యూరి యాను అధికంగా వాడటమే కాకుండా అనవసరంగా కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ ఉంచుకుంటున్నారు. దీని వల్లనే కృత్రిమ కొరత ఏర్పడింది. ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు విక్రయించే అవ కాశం లేకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. యూరియా బస్తాలకు బదులు నానో యూరియా వాడటం ఎంతో మేలు. - హేమలత, ఆత్మకూరు ఏడీఏ

యూరియా కొరతను వెంటనే తీర్చాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు ప్రాంతంలో యూరియా కొరతను వెంటనే తీర్చాలని సీపీఎం నాయకులు రణధీర్, సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గౌడ్‌సెంటర్‌లో ఎరువుల దుకాణాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందించాల్సి ఉండగా కొంత మంది రాజకీయ నాయకులు తమ పలుకుబడితో ఎరువులను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏమైంది : సీఐటీయూ


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం

కొత్తపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అసంఘటితరంగ కార్మికులకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న సంక్షేమ బోర్డు ఏమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా నాయకులు రామ్‌నాయక్ ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వారు కొత్తపల్లిలో జరిగిన సీఐటీయూ మండల సభలో పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాల్లో మార్పులను ఎవరి కోసం తెస్తున్నారని ప్రశ్నించారు. కార్మికులను బానిసలుగా మార్చి యజమానులకు, కార్పొరేట్లకు అనుకూలంగా చట్టసభల్లో మార్పులు తీసుకునివస్తే ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల హక్కులను హరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్, సహాయ కార్యదర్శి నక్కస్వాములు, అంగన్‌వాడీలు, ఆటో కార్మికులు, కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల నూతన కమిటీ ఎన్నిక

సీఐటీయూ కొత్తపల్లి మండల నూతన కమిటీని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా కలాం, కార్యదర్శిగా దినేష్, ఉపాధ్యక్షులుగా శేఖర్, శ్రీదేవి, సహాయ కార్యదర్శులుగా హరిత, ఉమామహేశ్వరి, కోశాధి కారిగా అబ్దుల్ రెహిమాన్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యేసురత్నం మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

తాగునీటిని వృథా చేయరాదు: ఎమ్మెల్యే


వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తాగునీటిని వృథా చేయరాదని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏబీఎం పాలెంలో జీఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాల్టీ నిధులతో ఏబీఎం పాలెంలో జీఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఏడాది కాలంలో నియోజకవర్గంలో అనేక వాటర్ ట్యాంకులను నిర్మించుకున్నామన్నారు. తద్వారా ఆయా గ్రామాలకు పూర్తి స్థాయిలో తాగునీటిని అందజేస్తున్నామన్నారు. ఇంకా చాలా ప్రాంతాల్లో నీళ్లట్యాంక్‌లు నిర్మించాల్సిన అవసరం ఉందని, వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పట్టణంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటికి సత్వర పరిష్కారం చూపుతామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, చిన్నరాజు, టీడీపీ నాయకులు కళాకర్, మోహన్, నిమ్మకాయల రాజు, మున్సిప ల్ కమిషనర్ బేబి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయ నిధి ఓ వరం

పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏబీఎం పాలెంలోని దాసరి సరోజమ్మకు రూ.12,000, కొల్లు నరసింహులుకు రూ.43,914 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా లక్షాలాది మంది పేదలకు సహాయం అందుతోందన్నారు. నిరుపేద ప్రజలకు సహాయాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, నందికొట్కూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, నందికొట్కూరు సొసైటీ చైర్మన్ ముర్తుజావలి, కౌన్సిలర్లు జాకీర్, హుస్సేన్, చిన్నరాజు, నిమ్మకాయల మోహన్, కళాకర్, వడ్డె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న క్షేత్రంలో వైభవంగా పల్లకీ ఉత్సవం

- అలరించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన


పల్లకీసేవలో దర్శనమిస్తున్న స్వామి, అమ్మవారు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్న క్షేత్రంలో ఆదివారం లోక కల్యాణం కోసం స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో అర్చకస్వాములు స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పల్లకీలో పూజలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్య స్వామికి విశేష అభిషేకం

లోకకల్యాణం కోసం ఆదివారం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరిం చుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య స్వామికి అభిషకాలు, పూజలు నిర్వహించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

నిత్య కళారాధనలో భాగంగా హైదరాబాదు మయూరి నృత్యాల య బృందం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరిం చింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వద్ద నృత్యప్రదర్శన ఏర్పాటుచేశారు. నిత్య, మనస్విని, మన్విత, నందిత, అక్షర, పూజశ్రీ తదితరుల నృత్య ప్రదర్శన అలరించింది.


శ్రీశైల మల్లన్న సన్నిధిలో సంప్రదాయ నృత్య ప్రదర్శన చేస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే బుడ్డాకు నాయకుల కృతజ్ఞతలు


ఎమ్మెల్యే బుడ్డాను సన్మానిస్తున్న మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ నజీర్ అహ్మద్

ఆత్మకూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన వివిధ పాలకవర్గాల ఏర్పాటులో తమకు సముచిత స్థానం కల్పించడం పట్ల ఆదివారం పలువురు నాయకులు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మకూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన నజీర్‌అహ్మద్‌ను నియమించడంతో ఆయన తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యేను సత్కరించారు. అలాగే ది ఆత్మకూరు వ్యవసాయ పరపతి సంఘం కమిటీ చైర్మన్‌గా నియామకమైన షాబుద్దీన్, డైరెక్టర్లు ప్రవీణ్, అమరం రమేష్‌లు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై ఎంతో నమ్మకాన్ని ఉంచి అప్పగించిన బాధ్యతలకు తగిన న్యాయం చేస్తామన్నారు. ఆయా కార్యక్రమా ల్లో టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు అబ్దుల్లాపురం బాషా, నబిరసూల్, టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కలిముల్లా పాల్గొన్నారు.

నంద్యాల కవికి సత్కారం


ప్రసాద్‌ను సన్మానిస్తున్న గజల్ శ్రీనివాస్

నంద్యాల కల్చరల్, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో నంద్యాల కవి కొప్పుల ప్రసాద్‌ను గజల్ శ్రీనివాస్ సన్మానించారు. విజయవాడ కేంద్రంగా విశ్వసాహితీ కళావేదిక ఆవిష్కార సభలో ఆదివారం కవితాగానం ఏర్పాటు చేశారు. డాక్టర్ పూర్ణచందు, విశ్వ సాహితీ కళావేదిక చైర్మన్ కొల్లి రమావతి పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్రసాద్ కవితాగానం చేయగా ఆయన్ను గజల్ శ్రీనివాస్ సత్కరించారు. అలాగే కొప్పుల ప్రసాద్ కు నంద్యాల రచయితలు, కవులు, ఉపాధ్యాయులు అన్నెం శ్రీనివాసరెడ్డి, వాసుదేవరెడ్డి, మహ బూబ్‌బాషా, కళారాధన కార్యదర్శి డాక్టర్ రవిక్రిష్ణ, అంతర్జాతీయ శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్, కళాకారులు తదితరులు అభినందనలు తెలిపారు.

వైసీపీ పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి

మహానంది, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గాజులపల్లికి చెందిన కొండా మధుసూదన్‌రెడ్డిని వైసీపీ రాష్ట్ర పంచాయితీరాజ్ విభాగం కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ అధి ష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనకు అవకాశం కల్పించిన శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి, నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త శిల్పా భువనేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మతోన్మాదాన్ని తరిమి కొడుదాం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు

బేతంచెర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని మతోన్మాదాన్ని తరిమికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనే యులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. ఈ నెల 23 నుం చి 25వరకు ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని నంద్యాల జిల్లా సీపీఐ సమితి ఆధ్వర్యంలో పాణ్యం సిమెంటు జూనియర్ కాలేజీలో జన సేవాదళ్ శిక్షణా శిబిరం సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం కొత్తబస్టాండు నుంచి పాతబస్టాండు మీదుగా రైల్వేస్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్య క్రమంలో నాయకులు బాబా ఫక్రుద్దీన్, మోట రాముడు, రాధాకృష్ణ, ఎం.రమేష్‌బాబు, నాగరాముడు, శివయ్య, కోయలకొండ నాగరాజు, రనత్ యాదవ్, ఉదయ్, ఎర్రిస్వామి, దస్తగిరి, నాగరాజు, ప్రదీప్, మధు, శ్రీకర్, శ్రీమన్నారాయణ, శ్రీరాములు, బాలు తదితరులు పాల్గొన్నారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సులభంగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో నేరాలకు పాల్పడితే కఠినచర్యలు ఎదుర్కావాల్సి ఉంటుందని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం మీర్జాపురం గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పలు వీధుల్లో పర్యటించి, ఇళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే ఎప్పటికైనా శిక్ష తప్పదని గుర్తుచేశారు. అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలతో జీవితంలో ప్రశాంతత కోల్పోతారని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద ఇళ్లలో సోదాలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణ శివారులో ఉన్న టిడ్కో గృహాల్లో ఆదివారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. డిఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో సీఐ దస్తగిరిబాబు, ఎస్‌ఐ నగీనా, పోలీస్ సిబ్బంది అనుమానాస్పద ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఏఎస్‌ఐలు వహాబ్, రాంభూపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ మధుసూదన్

ప్యాపిలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ మధుసూదన్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో మండలంలోని రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి గొడవలకు పాల్పడిన, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్యాపిలి, పెద్దపూదిళ్ల, పోతుదొడ్డి, చిన్నపూదిళ్ల రౌడి షీటర్లు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస పూజలు

చాగలమర్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ ఆలయాల్లో ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో శ్రావణమాస పూజలు వైభవంగా నిర్వహించారు. మహిళలు సామూహికంగా అభిషేకాలు, పూజలు చేశారు. సీతారాముల ఉత్సవమూర్తుల పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరబండ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ నాగేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిద్దెపల్లె ఫీడర్‌కింద రూరల్ డెవలప్‌మెంట్ (ఆర్‌డీఎస్) ఆధ్వర్యంలో 11 కేవీ పనులు జరుగుతున్నాయన్నారు. మిద్దెపల్లె, అనుంపల్లి, రేగులకుంట, దేవరబండ గ్రామాలకు ఉదయం 10నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజాము 3నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఉంటుందన్నారు.

మతోన్మాదాన్ని తరిమి కొడుదాం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు

బేతంచెర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని మతోన్మాదాన్ని తరిమికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. ఈ నెల 23 నుంచి 25వరకు ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని నంద్యాల జిల్లా సీపీఐ సమితి ఆధ్వర్యంలో పాణ్యం సిమెంటు జూనియర్ కాలేజీలో జనసేవాదళ్ శిక్షణా శిబిరం సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం కొత్తబస్టాండు నుంచి పాతబస్టాండు మీదుగా రైల్వేస్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాబా ఫకృద్దీన్, మోట రాముడు, రాధాకృష్ణ, ఎం.రమేష్‌బాబు, నాగరాముడు, శివయ్య, కోయలకొండ నాగరాజు, రనత్ యాదవ్, ఉదయ్, ఎర్రిస్వామి, దస్తగిరి, నాగరాజు, ప్రదీప్, మధు, శ్రీకర్, శ్రీమన్నారాయణ, శ్రీరాములు, బాలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించేలా కృషి

బనగానపల్లె, ఆగస్టు, 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించేలా కృషి చేస్తున్నట్లు స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు యాసిన్ అన్నారు. ఆదివారం ఎస్‌ఐవో కార్యాలయంలో సాధికార ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సభ్యులు అవేజ్, జహీర్, తౌఫిక్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

రుద్రవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమాయపల్లె గ్రామానికి చెందిన చిన్న గంగులయ్య, మరో నలుగురిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహ్మద్‌రఫీ ఆదివారం రాత్రి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన మల్లెల చిన్న ఓబులేసు అనే వ్యక్తి తన పొలంలో పని చేసుకుంటుండగా చిన్న గంగులయ్య, మరో నలుగురు కులంపేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. అడ్డువచ్చిన ఓబులేసు తల్లిపై కూడా దాడి చేశారు. దాంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీడని వర్షం



చాగలమర్రి, కొలిమిగుండ్ల మండలాల పరిధిలోని పొలాల్లో నిలిచిన వరద నీరు

- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు

చాగలమర్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మండల వ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజామున 34.4 మీ.మీ వర్షపాతం నమోదైంది. రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది పొంగి ప్రవహించింది. ఆనకట్ట ఐదు గేట్లను ఎత్తారు.


రాజోలి ఆనకట్ట వద్ద కుందూ ఉధృతి



కొలిమిగుండ్లలో కురుస్తున్న వర్షం

మొక్కజొన్న, మినుము, కంది, పెసర, ఉల్లి పంటల్లో వర్షపు నీరు నిలిచింది. కురిసిన వర్షం ఎండుతున్న పంటలకు జీవం పోసినట్లైందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కుందూనది దాటే ప్రయత్నం చేయరాదని, అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్‌ఐ సురేష్ సూచించారు.

కొలిమిగుండ్ల : మండలంలోని వివిధ గ్రామాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మండల వ్యాప్తంగా 14 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో భాస్కరరెడ్డి వెల్లడించారు. రెండేళ్లుగా సరైన వర్షాలు లేక, మండలంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. అయితే కొద్ది రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు ఆనందం కలిగిస్తున్నాయి.

కొనసాగుతున్న కృష్ణాష్టమి ఉత్సవాలు


కొలిమిగుండ్ల: శ్రీకృష్ణుడి ప్రతిమ వద్ద పూజలు చేస్తున్న త్రైతసిద్ధాంత సభ్యులు


క్రిష్టిపాడులో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

కొలిమిగుండ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : త్రైతసిద్ధాంతం, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో శ్రీకృష్ణుడి ప్రతిమలకు రెండవ రోజు ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని బందార్లపల్లె, కొలిమిగుండ్ల, మీర్జాపురం గ్రామాల్లో శ్రీకృష్ణుడి పూజలు కొనసాగుతున్నాయి. కాగా మీర్జాపురంలో 19న, కొలిమిగుండ్లలో 20న, బందార్లపల్లెలో 23న స్వామి వారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో పీఎంహెచ్ నాయుడు, రామకృష్ణారెడ్డి, బాబు, హరి, బాలు, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు, దొర్నిపాడు గ్రామాల్లో శ్రీకృష్ణుడికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటం, నృత్యం మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. యువకులు ఉట్టికొట్టారు. గెలుపొందిన యువకులకు కమిటీ నిర్వాహకులు బహుమతులు అందజేశారు. క్రిష్టిపాడు గ్రామంలో కమిటీ సభ్యులు పరాందాము, గోవిందు, నాగేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇస్కాన్ టెంపుల్‌లో..

రుద్రవరం: మండలంలోని హరినగరం అహోబిళం ఇస్కాన్ టెంపుల్‌లో ఆదివారం భక్తిశ్రద్ధలతో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. వైష్ణవ భజన కీర్తనలు భక్తులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శీల ప్రభుపాదాభిషేకం, వ్యాసపూజ ప్రవచనం నిర్వహించారు. 56 వంట కాల నివేదన రాధాకృష్ణులకు సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్, అహోబిళం మేనేజరు చంద్ర కిశోర దాస్, పలువురు పాల్గొన్నారు.


ఇస్కాన్ టెంపుల్‌లో రాధాకృష్ణులకు పూజలు చేస్తున్న అర్చకుడు

అధికారులు బాధ్యతగా పని చేయాలి

- గ్రామ కార్యదర్శుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం • వాడీవేడిగా మండల సమావేశం



వాటర్‌షెడ్ ఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి

డోన్ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతగా పని చేయాలని డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ అతిథి గృహం వరండాలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల కార్యదర్శులు అధిక సంఖ్యలో గైర్హాజరు కావడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ శాఖల అధికారులు ప్రగతిని వివరించారు. కొత్తకోట గ్రామానికి చెందిన సర్పంచ్ చంద్రన్న పలు ఫర్టిలైజర్స్ షాపులు, వ్యాపారస్థులు యూరియా ధరలను అధిక ధరలకు విక్రయిస్తున్నా రని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన వ్యవసాయాధికారి రైతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఎద్దుపెంట, యాప దిన్నె గ్రామాల్లో వాటర్‌షెడ్ పనులకు సంబంధించిన సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలను సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, వాటర్‌షెడ్ ఈవో విజయపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లచ్చుంపల్లె గ్రామ ఎంపీటీసీ ఓబులేసు మాట్లాడుతూ తమకు కూడా వాటర్‌షెడ్ సంబంధించిన సమాచారం ఇవ్వలేదన్నారు. ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వాటర్‌షెడ్ పనులకు సంబంధించిన సమావేశానికి అక్కడి స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం తప్పనిసరిగా ఇవ్వాలని వాటర్‌షెడ్ ప్రాజెక్టు ఈవోను సూచించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ నాగేశ్వరరెడ్డి అన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు బద్దెల రాజ్‌కుమార్, ఈవోఆర్‌డీ ఫకృద్దీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్, ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి, ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌భేగం పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం

ఆళ్లగడ్డ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 27 నుంచి నిర్వహించనున్న గణేశ్ ఉత్సవాలను అందరూ కలిసి కట్టుగా విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్ కోరారు. ఆదివారం గణేశ్ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణలో వీహెచ్‌పీకి, ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు.హిందువుల ఐక్యతను చాటేందుకు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రముఖ న్యావాదులు నీలకంటేశ్వరం, బోరెడ్డి లక్ష్మిరెడ్డి, మురళీధర్‌గౌడ్ సహాయ కార్యదర్శి రామాచారి, ప్రధాన కార్యదర్శి గ్యాస్ పుల్లయ్య వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాలిక్‌బాబా దేవస్థానం కమిటీ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



డోన్ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని రామచంద్ర మాలిక్‌బాబా సంస్థాన్ కమిటీ అధ్యక్షుడిగా ఐ.వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రామచంద్ర మాలిక్ బాబా సంస్థాన్‌లో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఐ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా చలపతిరావు, ప్రధాన కార్యదర్శిగా న్యాయవాది నరసింహులును ఏకగ్రీవంగా మాలిక్‌బాబా సంస్థాన్ కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.

ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి

డోన్ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోమాపురం గ్రామ రోడ్డులో వెలసిన శనేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని పూజారి విహారి స్వామి కోరారు. ఆదివారం డోన్‌కు చెందిన బచ్చు శ్రీనివాసులు దంపతులు ఆలయంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయించేందుకు ముందుకు రావడం అభినం దనీయమన్నారు. విరాళం చెక్కును పూజారికి అందజేశారు. దాతలకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించారు.

చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, ఆగస్టు, 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి ఆదివారం దాతలు విరాళం అందించారు. నంద్యాల పట్టణం మూలసాగరానికి చెందిన రామగోపాల్, సునీత దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు ఆలయాభివృద్ధికి రూ. 50వేలు ఆలయ కమిటీ ఛైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డికు అందించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ


బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

డోన్ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలు, రోగులకు ప్రార్థనసమయం జానీ ప్రభాకర్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ప్రతి యేటా సేవా కార్యక్రమాలు చేస్తుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీఈ రాఘవేంద్రగౌడు, టీఈ రామకృష్ణగౌడు, మద్దిలేటి గౌడు, శ్రీధర్‌గౌడు, అడ్వకేట్ మద్దిలేటి గౌడు, నారాయణ స్వామి గౌడు, వెంకట్రామ్ గౌడు, యు.తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి

చాగలమర్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమితోనే అభివృద్ధి సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీ నారాయణగౌడ్ అన్నారు. ఆదివారం బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. బీసీల సంక్షేమం టీడీపీ తోనే సాధ్యమన్నారు. సమావేశంలో బీసీ సంఘ నాయకులు సుబ్బ రాయుడు, పిచ్చయ్య, లాలయ్య, సిద్ధప్ప, పుల్లయ్య ఉన్నారు.

హామీలు నెరవేర్చడం టీడీపీకే సాధ్యం

శిరివెళ్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత టీడీపీకే సాధ్యమని యర్రగుంట్ల ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, టీడీపీ నాయకులు అన్నారు. గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఛైర్మన్ తపసి శ్రీరాములు, డైరెక్టర్ శీలం రామ్మోహన్, జాకీర్ హుసేన్, శీలం నరసింహ పాల్గొన్నారు.

20 టన్నుల యూరియా మంజూరు

చాగలమర్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాలకు 20 టన్నుల యూరియా మంజూరైనట్లు ఏవో రంగ నేతాజీ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముత్యాలపాడు, చిన్నవంగలి, డి.వనిపెంట, మల్లేవేముల, నేలంపాడు గ్రామాల్లోని ఆర్ ఎస్‌కేలకు యూరియా సరఫరా చేశామన్నారు.

లింగమయ్యకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని కొండమాయపల్లె, చిన్నకంబలూరు, యల్లావత్తుల, రుద్రవరం గ్రామాల్లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి చీరలు, బోనాలు సమర్పించారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

రుద్రవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు గుర్విరెడ్డి కోరారు. ఆదివారం రైతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన రైతు గోవిందిన్నె హుసేన్‌బాషా, రెండు ఎద్దులు ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి బాధితకుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో హుసేన్‌బాషా, గౌడ్ తదితరులున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్యాపిలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కల స్వైరవిహారం

- భయాందోళనలో ప్రజలు

చాగలమర్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కుక్కల బెడద రోజు రోజుకు పెరిగిపోతోంది. ఇష్టారాజ్యంగా రోడ్లపై తిరుగుతూ వాహనదారులు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పాతబస్టాండు, పెద్దమకానం, గాంధీబజార్, ముత్యాలపాడు బస్టాండు, చిన్నమకానం, పలు వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ వాహనదారులపై దాడికి యత్నిస్తున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువులకు జలకళ ..

కొలిమిగుండ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుసున్న వర్షాలతో మండలంలోని పలు చెరువులకు జలకళ సంతరించుకుంది. తిమ్మనాయినిపేట చెరువు, సద్దలవెంగన్న చెరువు, దయ్యాల చెరువులు మూడు, నాలుగేళ్ల తరువాత నీటితో నిండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండిపోయిన బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరిగి, పంటల సాగుకు అవకాశం ఏర్పడిందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నిండుకుండలా సద్దల వెంగన్న చెరువు

ప్రమాదకరంగా కల్వర్టులు


రక్షణ గోడ కూలిపోవడంతో ప్రమాదకరంగా ఉన్న వంక

కొలిమిగుండ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సమీపంలో అనంతపూరు - అమరావతి జాతీయ (ఎన్‌హెచ్-544డి) రహదారిలో రెండు చోట్ల కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కల్వర్టు పూర్తిగా దెబ్బతినింది. రహదారి పక్కనే పెద్ద ఎత్తున గుంత ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో కల్వర్టు రక్షణ గోడ పడిపోయి ప్రమాదకరంగా మారింది.

పైపులైన్ లీకేజీ..

చాగలమర్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అస్రఫ్ నగర్‌లో పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. పక్కనే ఉన్న మురుగు కాలువలో తాగునీరు కలుషితమవుతుంది. పైపులైన్ లీకేజీ కావడంతో నీరు సక్రమంగా కొళాయిలకు రావడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కలుషిత నీరు వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీ మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


అస్రఫ్ నగర్‌లో పైపులైన్ లీకేజీతో వృథా అవుతున్న నీరు